ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 16 మే 2025





కడప నగర శివారులోని చలమారెడ్డిపల్లె దగ్గర కొండకింద స్థలాలు ఇవ్వడంతో పునాది కూడా పడని దృశ్యం

సా..గుతున్నాయి..!

- ఇళ్ల నిర్మాణం సగం కూడా పూర్తికాని వైనం
- అర్బన్ లేఅవుట్లలో నీటికష్టాలు
- రూ.7కోట్ల మేర పెండింగు బిల్లులు
- మంజూరైన ఇళ్లు 89,918
- పూర్తి 37,900 మాత్రమే



పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణం

జగన్ హయాంలో ఇంటి నిర్మాణ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఎక్కడో ఊరికి 10 నుంచి 15 కి.మీ దూరంలో లేఅవుట్లు వేసి ఇళ్లు మంజూరు చేశారు. అక్కడ కనీస వసతులు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం ముందుకు వెళ్లడం లేదు. ఎంతగా అంటే మంజూరైన ఇళ్లల్లో కనీసం సగం కూడా పూర్తి కాని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఇళ్లను పూర్తి చేయించడం చంద్రబాబు ప్రభుత్వానికి తలభారంగా మారింది.

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో 89,918 పక్కాగృహాలు మంజూరు అయితే ఇప్పటి వరకు కేవలం 37,900 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. లక్ష్యంలో 42 శాతం పూర్తి చేశారు. పీఎంఏవై-1 ఇళ్ల నిర్మాణానికి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు కేంద్రం గడువు ఇచ్చింది. అప్పట్లోగా ఈ ఇళ్లను పూర్తి చేయాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12వ తేదీన 3 లక్షల గృహ ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మన జిల్లాకు కూడా పదివేల ఇళ్ల నిర్మాణాన్ని టార్గెట్ ఇచ్చారు. అయితే మంగళవారం నాటికి ఆరువేల ఇళ్లు పూర్తి చేశారు. వచ్చే నెల 12లోపు మిగతా నాలుగు వేల ఇళ్లను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సాగుతున్న ఇళ్ల నిర్మాణం

2014-19 చంద్రబాబు హయాంలో ఒక్కో పక్కా ఇంటి నిర్మాణానికి స్కీంను బట్టి రూ.రెండు లక్షలకు పైగా ఇచ్చారు. అయితే 2019-2024 జగన్ హయాంలో ఇంటి వ్యయాన్ని రూ.లక్షా 80వేలకు కుదించారు. అప్పటికి నిర్మాణ వ్యయం బాగా పెరిగిపోయింది. ఇచ్చే సొమ్ము సరిపోని పరిస్థితి. ఊరికి దూరంగా విసిరేసినట్లుగా లేఅవుట్లు వేసి ప్లాట్లు ఇచ్చారు. అక్కడ నీళ్లు లేవు. రోడ్లు లేవు. కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో 29 లేఅవుట్లు ఉన్నాయి. కడప పరిధిలోనే 14 లేఅవుట్లు ఉన్నాయి. ఇవన్నీ సిటీకి 15 కి.మీ దూరంలో ఉన్నాయి. అర్బన్ పరిధిలో వేసిన లేఅవుట్లలో వసతులు లేవు. ఇక్కడ బోర్లు వేశారు. కానీ ట్యాంకులు లేవు. దీంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. లేఅవుట్లలో చేపట్టిన మౌలిక వసతులకు సుమారు రూ.7కోట్ల మేర బిల్లులు పెండింగులో ఉన్నాయి. దీంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేదు. అందుకే అర్బన్ లేఅవుట్లలో నిర్మాణం ముందుకు సాగడంలేదు.

అదనపు సాయం

ఇళ్లను పూర్తి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. జగన్ హయాంలో ఇచ్చిన రూ.1.80లక్షలు సరిపోవడంలేదని భావించారు. పేదలైన ఎస్టీ ఎస్సీ బీసీలకు అదనపు సాయం అందించాలని నిర్ణయించారు. గత డిసెంబరులో ప్రత్యేక జీవో తీసుకువచ్చి పేదలైన ఎస్టీలకు అదనంగా రూ.75వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50వేలు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలో ఆరువేల మందికి అదనపు సాయానికి అర్హులయ్యారు. ఈ సొమ్మును బేస్‌మట్టం, రూఫ్‌లెవల్, శ్లాబు పూర్తయిన తరువాత దశల వారీగా ఇస్తారు. అదనపు సాయం పొందిన వారు సుమారు 500 మంది లబ్ధిదారులు ఇళ్లనిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇక లేఅవుట్లలో వేసిన ఇళ్లు ముందుకు సాగడంలేదు. ఇళ్లు నిర్మించుకోవాలని గృహనిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు మంజూరైన వారు కట్టుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అర్బన్ లేఅవుట్లలో నీటి వసతి కల్పిస్తే తప్ప ఇళ్లనిర్మాణం వేగవంతం అయ్యే పరిస్థితి లేదు.

జిల్లాలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తే..

నియోజకవర్గం	మంజూరు	బీపీఎల్	బీఎల్	ఎల్ఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తి	శాతం
బద్వేలు	105219	269	2035	85	1197	1294	5649	54
మైదుకూరు	7841	154	1152	68	572	913	4983	64
ప్రొద్దుటూరు	18473	1145	9023	137	2080	2387	3702	20
జమ్మలమడుగు	8790	318	2244	63	776	219	5171	59
పులివెందుల	16496	688	2705	209	2717	2919	7258	44
కమలాపురం	4783	212	676	44	532	265	3054	64
కడప	21129	506	11343	204	1490	713	6911	33
సిద్దవటం, ఒంటిమిట్ట	1837	53	353	26	191	42	1172	64
మొత్తం	89918	3345	29531	836	9555	8752	37900	42



ఇదీ రోడ్డు పరిస్థితి



చలమారెడ్డిపల్లె దగ్గర జగనన్న కాలనీలో నీళ్లు లేక నిరుపయోగంగా ఉన్న ట్యాంకులు

ఆయిల్ నిక్షేపాల కోసం సర్వే

లింగాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోనాల గ్రామంలో ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే ప్రారంభించారు. రెండు నెలల క్రితం లింగాల, చిన్నకుడాల, రామన్నూతలపల్లె తదితర గ్రామాలలో సర్వే నిర్వహించారు. మండలంలో మరోసారి సర్వే నిర్వహించడంపై ఆసక్తి నెలకొంది. జిల్లాలో యర్రగుంట్ల, పులివెందుల ప్రాంతాలలో ఆయిల్ నిక్షేపాలున్నాయని ప్రాథమిక నిర్ధారణ అయిందని, దీంతో ఏ స్థాయిలో నిక్షేపాలున్నాయో నిర్ధారించుకోవడం కోసం సర్వే చేస్తున్నామని ఓఎన్‌జీసీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఓఎన్‌జీసీ కేంద్రం కార్యాలయం నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ఇన్‌స్ట్రుమెంటల్ వాహనానికి శాటిలైట్ ద్వారా ఏ ప్రదేశంలో బోరుబావి తవ్వాలో సంకేతాలు అందుతాయి. ఆ ప్రదేశంలో 85అడుగుల లోతువరకు బోరు బావి తవ్వి దానిద్వారా భూమిలోపల డిటోనేటర్లతో పేలుస్తారు. భూగర్భంలో ఉన్న నిక్షేపాల గురించి ఇన్‌స్ట్రుమెంటల్ వాహనం విశ్లేషణ చేసి డేటా మొత్తం ఓఎన్‌జీసీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తుంది. ఇన్‌స్ట్రుమెంటల్ వాహనంతో ఈ ప్రాంతంలో సర్వే చేయడంతో స్థానికుల్లో ఆసక్తి నెలకొంది.



బోరుబావి ద్వారా భూమి లోపల పేల్చేందుకు డిటోనేటర్‌ను అమర్చుతున్న దృశ్యం



డేటాను విశ్లేషించే వాహనం

కూటమిది చేతగాని ప్రభుత్వం : తులసిరెడ్డి

పులివెందుల టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): కూటమిది చేతగాని ప్రభుత్వమని మాజీ రాజ్య సభసభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ రూ.670 కోట్లు ఖర్చు చేసి పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించారన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి నేషనల్ మెడికల్ కమిషన్ 16 ఆగస్టు 2024న ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసిందన్నారు. మౌలిక సదుపాయాలు లేవని, సిబ్బంది కొరత ఉందని సాకులు చూపి మంజూరు చేసిన సీట్లను వద్దని చంద్రబాబు ప్రభుత్వం 10 సెప్టెంబరు 2024న నేషనల్ మెడికల్ కమిషన్‌కు లేఖ రాయడం దురదృష్టకరమన్నారు. దీంతో ఏపీ 2024-25లో 700 ఎంబీబీఎస్ సీట్లు, 2025-26లో మరో 700 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయిందన్నారు. జగన్ చేసిన తప్పిదాలే పులివెందుల మెడికల్ కాలేజీ ప్రారంభం కాకపోవడానికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, దీక్షిత్, ఓబులేసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల

- జిల్లాలో 93 శాతం ఉత్తీర్ణత

కడప ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈసెట్-2025 ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 93శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీలు అనుబంధ కళాశాలల్లో రెండవ సంవత్సరం బీఈ బీటెక్, బి.ఫార్మసీలో లెటర్ అడ్మిషన్ కోసం నిర్వహించిన ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025 ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం ఈ ఫలితాలను జేఎన్టీయూ ప్రకటించింది. జిల్లాలో 1,909 మంది దరఖాస్తు చేసుకోగా 1880 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 1763 మంది (93.78శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే పురుషులకు సంబంధించి 1128 మంది పరీక్షలకు హాజరుకాగా 1039 మంది (92శాతం) ఉత్తీర్ణత సాధించారు. స్త్రీలు 752 మంది పరీక్షలకు హాజరుకాగా 724 మంది (96శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఐదేళ్లుగా నన్ను పట్టించుకోలేదు

- వైసీపీకి రాజీనామా చేస్తున్నా
- మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

మైదుకూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నా తనను వైసీపీలో ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నా అని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరుల సమావేశంలో రాజీనామా లేఖను చూపించి వివరాలు వెల్లడించారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా గెలిచినప్పటి నుంచి అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. మూడు నెలలుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తనకు, వైసీపీ కౌన్సిలర్లకు కలిపి సమావేశం ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తెల్లవారుజామున మున్సిపల్ చైర్మన్ అయిన తనకు తెలియకుండా కొందరు కౌన్సిలర్లను వెంట పెట్టుకొని మాజీ ముఖ్యమంత్రిని కలిపేందుకు రఘురామిరెడ్డి విజయవాడకు వెళ్లారని మండిపడ్డారు. తనకు విలువ ఇవ్వని పార్టీలో ఇక కొనసాగలేనని అందుకే పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశానని తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ముఖ్యమంత్రికి జగన్‌మోహన్‌రెడ్డికి పంపుతున్నట్లు తెలిపారు. తన వెంట నడిచే కౌన్సిలర్లు, కుటుంబ సభ్యులతో చర్చించి తదుపరి ఏం చేయాలనేదానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటానన్నారు. కాగా.. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మైదుకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు లింగన్న, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు తదితరులు కలిశారు.



రాజీనామా లేఖను చూపుతున్న మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

కుర్చీ వేయలేదని కక్ష సాధింపు

- జీహెచ్‌ఎంసీ యాక్ట్ చూపి అనర్హత వేటా?
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): కుర్చీ వేయలేదని కక్షసాధింపులకు పాల్పడుతు న్నారని, జీహెచ్‌ఎంసీ యాక్ట్ చూపి మేయర్‌పై అనర్హత వేటు వేయడం విడ్డూరంగా ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి లేదు ఇచ్చిన హామీలు అమలుకాలేదు కానీ కక్ష సాధింపులో మాత్రం ముందుందని విమర్శించారు. మేయర్ కుమారుడి సంస్థకు కమిషనర్ రిజిస్టర్ చేసినప్పుడు ఎందుకు రిజెక్ట్ చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు చాలా కంపెనీలు ఉన్నాయని మరి వాళ్ల కాంట్రాక్ట్ పనులు చేయవచ్చా అని ప్రశ్నించారు. కుర్చీ కోసం ఇదంతా జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే నగరానికి ఒక్కపైసా నిధులు తీసుకురాపోగా కక్ష సాధింపులకు దిగడం సరికాదన్నారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.



మారిన వైసీపీ స్వరం

- మా ప్రభుత్వంలో చేయలేక పోయాం
- మీ ప్రభుత్వంలోనైనా చేయండి
- జడ్పీ సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధులు
- ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ

ఈ పర్యాయం జడ్పీ సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధుల స్వరం మారింది. మా ప్రభుత్వంలో పనులను పూర్తిచేయలేక పోయాం.. మీ ప్రభుత్వంలోనైనా పెండింగ్ పనులకు తగిన నిధులు కేటాయించి మోక్షం కల్పించాలని వినమ్రంగా సూచించారు. వైసీపీ, టీడీపీ కలిసి ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ కొనసాగించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, గిట్టుబాటు ధరలు, నీటి ఎద్దడి, విద్యుత్, రోడ్లు, విద్య, వైద్యం, పనుల పురోగతి తదితర ప్రధాన సమస్యలపై చర్చించారు.



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రామగోవింద్‌రెడ్డి చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు

కడప రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో పాటు టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, జడ్పీటీసీలు, ఎంపీపీలు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఉగ్రదాడిలో మరణించిన జవాన్ మురళీనాయక్, ఇటీవల మరణించిన మాజీ జడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డిలకు నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చను కొనసాగించారు.

నకిలీ విత్తనాలపై ధ్వజం

అజెండాలోని మొదటి అంశంగా వ్యవసాయ శాఖపై ఉదయం 10-50 నుంచి 12-13 నిమిషాల వరకు చర్చ సాగించారు. చక్రాయపేట మండలంలో తక్కువ వర్షపాతం నమోదైందని భూగర్భ జలాలు అడుగంటాయని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కరువు మండలంగా ప్రకటించాలని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని 71 మంది రైతులు పాడాలో పైపులకు డబ్బులు చెల్లించి రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు పైపులు ఇవ్వలేదన్నారు. అకాల వర్షాలకు మామిడి తోటలు తెబ్బతిన్నాయన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పావలా వడ్డీ కింద రైతులు తీసుకున్న క్రాప్ లోన్లను ఇంతవరకు ఏపీజీబీ అధికారులు జమచేయలేదని వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ కరువుతో అరకొరగా పండిన అరటి, కర్బూజ, దోస, నిమ్మ పంటలకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ అరటి ఉత్పత్తులను మార్కెటింగ్ శాఖ అధికారులు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేస్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తగిన చొరవ చూపడం లేదన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్యయాదవ్ మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారిపల్లె, నల్లయ్యగారి పల్లెలో నాసిరకం ఉల్లి విత్తనాల కారణంగా దాదాపు 30 హెక్టార్లలో పంటలను రైతులు నష్టపోయారన్నారు. బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ నాసిరకం విత్తనాల కారణంగా రబీలో దాదాపు 100 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని

- మిగతా 6వ పేజీలో..

మేయర్ పదవిని దుర్వినియోగం చేశారు

- కాంట్రాక్టులను కుటుంబసభ్యుల కంపెనీకి కట్టబెట్టారు
- కడప మేయర్ తొలగింపుపై హైకోర్టులో ఎస్‌జీపీ వాదనలు
- ఆరోపణలపై వివరణకు సమయం ఇవ్వలేదు
- వెంటనే పదవి నుంచి తొలగించారు
- పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు
- విచారణ వారం రోజులకు వాయిదా



అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బాధ్యతల నుంచి తనను తొలగించడాన్ని సవాల్ చేస్తూ కె.సురేశ్‌బాబు హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని గురువారం కోర్టు లంచ్ మోషన్‌గా స్వీకరించి విచారణ జరిపింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ప్రణతి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తన పదవిని దుర్వినియోగం చేశారన్నారు. కార్పొరేషన్ పరిధిలోని కాంట్రాక్ట్‌లను తన సతీమణి, కుమారుడి కంపెనీకి కట్టబెట్టారన్నారు. కౌన్సిల్ ఆమోదం కూడా తీసుకోలేదని తెలిపారు. హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులకు అనుగుణంగా పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకున్న తరువాతే తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. తొలగింపునకు కారణం పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉందని చెప్పారు. ఈ దశలో న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ జోక్యం చేసుకుంటూ.. వర్ధిని కనస్ట్రక్షన్స్‌కు పనులు కేటాయించాలని సురేశ్‌బాబు మున్సిపల్ కమిషనర్‌పై ఏమైనా ఒత్తిడి చేశారా? అని ప్రశ్నించారు. ఎస్‌జీపీ ప్రణతి బదులిస్తూ వివరాల కోసం సమయం ఇవ్వాలని కోరారు. ధర్మాసనం ఉత్తర్వుల మేరకు పిటిషనర్ తొలగింపు ఉత్తర్వులు అమల్లోకి వచ్చేందుకు రెండువారాల సమయం ఉందన్నారు. విచారణను వచ్చేవారానికి వాయిదా వేయాలని కోరారు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. అంతకుముందు పిటిషనర్ తరఫున న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపించారు. వర్ధిని కనస్ట్రక్షన్స్ కంపెనీ పిటిషనర్ సతీమణి, కుమారుడికి చెందినది అన్నారు. ఆ కంపెనీకి పనుల కేటాయింపుపై పిటిషనర్‌కు అవగాహన లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ నేరుగా పనులు కేటాయించారని చెప్పారు. ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ముందు పిటిషనర్ వ్యక్తిగతంగా హాజరయ్యారన్నారు. వివరణ ఇచ్చేందుకు న్యాయవాదితో పాటు హాజరయ్యేందుకు అనుమతివ్వాలని, రెండువారాల సమయం ఇవ్వాలని కోరారన్నారు. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకోకుండానే మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఉత్తర్వులపై స్టే విధించాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను వచ్చేవారానికి వాయిదా వేశారు.

మారిన వైసీపీ స్వరం

- మా ప్రభుత్వంలో చేయలేకపోయాం
- మీ ప్రభుత్వంలోనైనా చేయండి
- జడ్పీ సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధులు
- ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ

(5వ పేజీ తరువాయి)

ఈసారైనా ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీకేలలో ఎరువులు లేకపోవడంతో డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ ఫలానా డీలర్ అని చెప్పితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అరికట్టకపోతే ఎలా అన్నారు.

మార్కెటింగ్‌శాఖ అధికారులపై చిటపటలు

మార్కెటింగ్‌శాఖ చర్చలో అధికారులపై ప్రజాప్రతినిధులు చిటపటలాడారు. పులివెందుల మార్కెటింగ్‌శాఖ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విరుచుకుపడ్డారు. వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధరలను నిర్ణయించడం వలన చీనీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ సిండికేట్ అయిన వ్యాపారులు ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉండేవారే కావడంతో వారి ఆటలు సాగుతున్నాయన్నారు. వేంపల్లెలో రూ.2.50 కోట్లతో మార్కెట్ యార్డును ప్రారంభించినప్పటికి నిరుపయోగంగా ఉందని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ కడప మార్కెట్ యార్డులో మౌలిక వసతులు లేక పంట ఉత్పత్తులు వర్షంలో తడిసిపోతున్నాయన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి

విద్యాశాఖ చర్చలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సూచించారు. క్వాలిఫైడ్ టీచర్లు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నారని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ నాడు-నేడు కింద మిగిలిపోయిన పనులను పూర్తిచేయాలన్నారు.

ఆర్‌అండ్‌బీ శాఖ చర్చలో

బి.మఠంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో అక్రమంగా షాపులు ఏర్పాటుచేసుకుని నడుపుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వీరనారాయణరెడ్డి కోరారు. చెన్నూరు ఎంపీపీ సురేశ్, పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య తదితరులు తమ మండలాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రైతులపై కేసులు పెట్టడం సరికాదు

పెద్దముడియం మండలంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం మంచిదేనని కానీ దీని పేరుతో రైతులకు అన్యాయం చేయడం తగదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. రైతుల అనుమతి లేకుండానే వారి పొలాల్లో సోలార్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. రైతులు అడ్డుపడితే వారిపై కేసులు పెడుతున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి సోలార్ ప్రాజెక్టు ఎంతో అవసరమన్నారు. సాగుకు పనికిరాని, నిరుపయోగంగా ఉండే భూములలో మాత్రమే ఏర్పాటు చేస్తున్నారన్నారు. మీరు చెప్పినది ఏదైనా ఉంటే విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

హార్టికల్చర్ హబ్‌గా కడప

రాయలసీమలోని కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చామని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో లక్ష ఎకరాలను హార్టికల్చర్ కింద సాగుచేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందులో దాదాపు 60వేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద బహు వార్షిక పద్ధతిలో పండ్లతోటల పెంపకం, 40వేల ఎకరాల్లో వార్షిక పద్ధతిలో ఉద్యాన సహాయ అభివృద్ధి పథకం కింద పూలు, కూరగాయల సాగుకు సుముఖంగా ఉన్న రైతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 2.10 లక్షల మంది అర్హులైన రైతులను పరిశీలిస్తున్నామన్నారు. పులివెందుల నియోజకవర్గంలో పాడా రద్దయిన నేపథ్యంలో రైతులు పైపుల కోసం చెల్లించిన నగదుకు సంబంధించి ఏపీఎంఐపీ ద్వారా న్యాయం చేసే విధంగా కృషిచేస్తామన్నారు. ఈ ఖరీఫ్‌లో వ్యవసాయానికి సంబంధించి సీడ్ ఉత్పత్తి విధానాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో బోర్లు వేసిన వెంటనే పవర్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

జడ్పీ నిధుల కేటాయింపులో ఎమ్మెల్యేలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సభకు ప్రతిపాదన చేశారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి తెలిపారు. జడ్పీ నిధులను సభ్యులందరికి సమానంగా ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. అందరి సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి

రూ.13.53 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

- ఇప్పటికే 251 పనులు పూర్తి
- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ

పీలేరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ఊపందుకుంది. మొదటి విడతలో రూ.13.53 కోట్లతో 30.24 కిలోమీటర్లు సీసీ రోడ్ల నిర్మాణం కోసం 282 పనులు చేపట్టారు. ఇందులో వాల్మీకిపురంలో ప్రహరీ నిర్మాణం పోను మిగిలిన 281 పనులు సీసీ రోడ్లు కావడం గమనార్హం.



పీలేరు ఎన్టీఆర్‌నగర్‌లో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి (ఫైల్) - పీలేరులో నిర్మించిన సీసీ రోడ్డు

నాణ్యతలో రాజీపడం...



పీలేరు నియోజకవర్గంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. ఎక్కడా క్వాలిటీలో రాజీపడడం లేదు. పనుల నిర్వహణ, పర్యవేక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పనులపై క్వాలిటీ కంట్రోల్ ప్రత్యేక నిఘా ఉంది. కాంట్రాక్టర్లు సైతం పనుల నాణ్యతలో అధికారులపై ఒత్తిడి తేవడం లేదు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం. ఎక్కడైనా తేడా వస్తే ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

\- మధుసూదన, డీఈఈ, పంచాయతీరాజ్, పీలేరు.

పీలేరులో రూ.3.81 కోట్లతో 79 పనులు, కేవీ పల్లెలో రూ.1.80 కోట్లతో 23 పనులు, కలకడలో రూ.1.75 కోట్లతో 38 పనులు, కలికిరిలో రూ.2.19 కోట్లతో 51 పనులు, గుర్రంకొండలో రూ.1.73 కోట్లతో 48 పనులు, వాల్మీకిపురంలో రూ.2.41 కోట్లతో 41 పనులు చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 251 పనులు పూర్తి చేసి 28.38 కిలోమీటర్లు సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. మరో 30 పనులు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. పీలేరు పట్టణ శివారు ప్రాంతం ఎన్టీఆర్ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఇటీవల ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించి ప్రారంభించడంతో పాటు అధికారులు, పనులు చేసిన వారిని అభినందించారు.

కొత్తగా రూ. 1.32 కోట్లతో 31 పనులు

మొదటి విడతలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావడంతో డిస్ట్రిక్ మినరల్ గ్రాంట్‌లో భాగంగా రూ.1.32 కోట్లతో కొత్తగా 31 పనులు మంజూరయ్యాయి. ఇందులో కలకడలో రూ.19 లక్షలతో 4 పనులు, కలికిరిలో రూ.85.60 లక్షలతో 19 పనులు, పీలేరులో రూ.13 లక్షలతో 3 పనులు, వాల్మీకిపురంలో రూ.15 లక్షలతో 3 పనులు మంజూరు చేశారు.

రూ.10 కోట్లతో కొత్తగా ప్రతిపాదనలు....

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పీలేరు నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కలెక్టర్, డ్వామా పీడీలకు ప్రతిపాదనలు పంపారు. సీసీ రోడ్లు సత్వరం నిర్మించాల్సిన వివరాలతో ప్రతిపాదనలు పంపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

మదనపల్లెలో అగ్ని ప్రమాదం

- రూ.2 లక్షల ఆస్తినష్టం

మదనపల్లె అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీలోని బాబునగర్ కాలనీలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప వివరాల మేరకు.. వన్నూర్‌సాహెబ్ గుట్ట సమీపంలో లక్ష్మీదేవి, శ్రీనివాసులు నివాసం ఉంటున్న ఇంటికి ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిందని సమాచారం అందడంతో వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశామన్నారు. ఇందులో సుమారు రెండు లక్షలకు పైగా నష్టం జరిగిందని ఇంటి యాజమాని తెలిపారన్నారు. ప్రమాదంలో ఇంట్లోని బీరువా, బట్టలు, గ్యాస్ స్టవ్, వంట సామగ్రి, ఇంటిపత్రాలు కాలిపోయాయని పేర్కొన్నారు. ఇంట్లోని కరెంట్ మీటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మొదలై అగ్నిప్రమాదం జరిగిందన్నారు. తాలుకా సీఐ కళావెంకటరమణ, అగ్నిమాపక అధికారి శివప్ప, పోలీసులు పాల్గొన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఘనంగా ముగిసిన కొత్తపురమ్మ జాతర



కొత్తపురమ్మ ఆలయ జాతర ప్రాంగణంలో జనం

సంబేపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్యాలలో కొత్తపురమ్మ జాతర వైభవంగా ముగిసింది. ఏడాదికి ఒకరోజు వచ్చే జాతర ప్రజల్లో సందడిని, సంతోషాన్ని కలిగిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా జాతరలకు వెళ్లడం ఆ రోజు ఆలయ ప్రాంగణాల్లో సంతోషంగా, సందడిగా గడపడం విశేషం. జాతరలో కనిపించే బంధువులు, స్నేహితులు ఒక్కొక్కరు బాగుండారా అంటూ పలకరింపులు, పిల్లలు బొమ్మలు కావాలని మారాం చేయడం, కావాల్సిన బొమ్మలు కొనడం ఎవరి సందడి వారిది. జాతరల్లో సోది చెప్పించుకోవడం ఇలా ప్రజల్లో ఎక్కడ లేని సంతోషం కనిపిస్తుంది. గురువారం దుద్యాల గ్రామ దేవత కొత్తపురమ్మ జాతర ఘనంగా ముగిసింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. భక్తులతో జాతర వాతావరణం కిక్కిరిసిపోయింది. కళ్లిపాటు కార్యక్రమంతో అమ్మవారి జాతర ఘనంగా ముసిగింది.



అమ్మవారికి పొట్టేళ్లు, మేకపోతులతో బోనాలు

తంబళ్లపల్లెలో గాలివాన బీభత్సం





కన్నెమడుగులో గాలివానకు నేలకూలిన విద్యుత్ స్తంభం - సిద్దవటంలో గాలివానకు పడిపోయిన విద్యుత్ స్తంభం

తంబళ్లపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. మండల వ్యాప్తంగా 27.2 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గాలివానకు పలుచోట్ల కోతకు వచ్చిన మామిడికాయలు రాలిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నెమడుగులో విద్యుత్ స్తంభం నేలకూలింది. గాలికి పలుచోట్ల కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

నేలకొరిగిన స్తంభాలు,

సిద్దవటం, మే 15 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం రత్నసభాపతినగర్‌లో గురువారం పెనుగాలుల బీభత్సానికి విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. గాలులు బీభత్సంతో విద్యుత్ స్తంభాలు 2, పెద్ద వృక్షం పడిపోయాయి. విద్యుత్ ఏఈ జయచంద్ర విద్యుత్ పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టారు.

కిసాన్ మేళా నిర్వహణకు సర్వం సిద్ధం

రైల్వేకోడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): కిసాన్ మేళా కార్యక్రమం శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం ఆవరణంలో నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మామిడి తదితర పంటల ప్రదర్శన కోసం 12 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రైతులు, అధికారులు, సిబ్బందికి భోజన సదుపాయాల ఏర్పాటుకు సిద్ధం చేశారు. సమావేశంలో మాట్లాడానికి ప్రతినిధులకు సమావేశ మందిరం ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి సుమారు 500 మంది రైతులు వస్తున్నారు. అదేకాకుండా ఉద్యాన విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రదర్శనల ఏర్పాట్లు చేశారు. కిసాన్‌మేళా కార్యక్రమం విజయవంతం చేయాలని ఉద్యాన పరిశోధన స్థానం వారు కోరుతున్నారు.

పీజీఆర్‌ఎస్‌లో పదేపదే ఫిర్యాదులు

- బాధితుడిని విచారించిన సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం బీకేపల్లె రెవెన్యూ గ్రామానికి సంబంధించి భూవివాదంపై ఓ వ్యక్తి పీజీఆర్‌ఎస్‌లో పదేపదే ఫిర్యాదులు చేస్తుండడంతో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ బాధితుడిని పిలిపించి విచారించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్ కోర్టు హాల్లో విచారణ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు నాగరాజు మీడియాతో మాట్లాడుతూ తనకు, తన కుమార్తెలకు బీకేపల్లె సర్వే నెంబర్లు 424, 425, 433లో మొత్తం 8.83 ఎకరాలు పిత్రార్జితంగా వచ్చిన భూమికి 2017 సంవత్సరం వరకు 1బి, అడంగల్ వుండేవన్నారు. తరువాత వచ్చిన రెవెన్యూ అధికారులు ఈ భూమిని నోషనల్ ఖాతాలో ఎక్కించారని, అప్పటి నుంచి తమ భూమికి పాసుపుస్తకం మంజూరు చేయాలని ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా, సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై సబ్‌కలెక్టర్ తనను విచారించారని సంబంధిత భూమి చుట్టూ కంచె వేసుకుని తమ ఆధీనంలో వుంచుకుంటే, రెవెన్యూ అధికారులు వచ్చి సబ్ డివిజన్ చేసి పాసుపుస్తకాలు ఇస్తామని చెబుతున్నారని బాధితుడు తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంగంవారిపల్లికి చెందిన ఓ మహిళతో బి.కొత్తకోటకు చెందిన అభిలాష్‌రెడ్డి (28) ఫేస్‌బుక్ ద్వారా పరిచయాన్ని పెంచుకున్నారు. వీరి పరిచయం దాదాపు నాలుగేళ్లుగా కొనసాగింది. కాగా కొన్ని రోజులుగా అభిలాష్‌రెడ్డి తనకు రూ.20 లక్షలు ఇవ్వాలని ఆ మహిళను వేధింపులకు గురిచేసేవాడు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే ఫేస్‌బుక్‌లో తమ సంభాషణను బయటపెడతానని బెదిరించాడు. దీంతో ఆ మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అభిలాష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదోన్నతుల కోసం ఎదురుచూపు...!



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఉపాధి హామీ ఉద్యోగుల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..!

మదనపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీరిని ఏమాత్రం పట్టించుకోకపోగా పదోన్నతులతో పాటు పీఆర్‌సీని కూడా పక్కనపెట్టిందని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులు 19 నుంచి 23 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా, పదోన్నతులు కూడా కల్పించలేదు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మాతృశాఖలో పనిచేస్తున్న ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులకు టైం స్కేల్ అమలుకు శ్రీకారం చుట్టి చరిత్ర సృష్టించింది. 2014-2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్లను సాంకేతిక సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లకు, ఎంటీసీలకు అదనపు కార్యక్రమ అధికారుల (ఏపీవో)లుగాను, హెచ్‌ఆర్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉన్నత విద్యార్హతలు కలిగి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్, ఈవోఆర్‌డీ కేడర్లలో (జీవో ఆర్.టి.నంబర్ 312, 2006) నియమితులైన ఏపీవోలు, అలాగే ఈసీలు, కోర్స్ డైరెక్టర్లు, హెచ్‌ఆర్ మేనేజర్లు, ప్లాంటేషన్ మేనేజర్లు, సహాయ పథక సంచాలకులు(ఏపీడీ)గా పదోన్నతి పొందారు. ఏపీడీలు అడిషనల్ పీడీలుగా పదోన్నతి పొందారు.

ఉపాధిహామీ పథకం అమలులో వస్తున్న మార్పులకు అనుగుణంగా అత్యున్నత పరిజ్ఞానంతో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడం, అమలుపరచడం, పర్యవేక్షణ చేయడం, పరిపాలనాపరమైన అంశాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధి హామీ ఉద్యోగులు అన్ని క్యాడర్లలోనూ పదోన్నతులకు అర్హులేనని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ గ్రావెల్, బి.టి, సిమెంట్ రోడ్డు, సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి, రైతుసేవా, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల ప్రహరీగోడల నిర్మాణం, తదితర మౌలిక వసతులు కల్పించడంలో ఉపాధి హామీ ఉద్యోగుల భాగస్వామ్యం అధికంగా ఉంది. అలాగే అటవీ, వ్యవసాయ, పంచాయతీరాజ్, విద్య, వైద్య, రైల్వే, జలవనరులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ మొదలైన ఇతర శాఖల సమన్వయంతో రైతు సంక్షేమ పథకాలు ఉపాధి హామీ ద్వారానే జరుగుతున్నాయి. ఇందులో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రామీణాభివృద్ధి శాఖలో 70 శాతం పదోన్నతులు కల్పించాలనే డిమాండ్ ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో ఎస్‌ఆర్‌డీఎస్ కింద పనిచేస్తున్న ఎఫ్‌టీఈల నియామకం తేదీ, తదితర పొరపాట్లను సరిదిద్దాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ప్రస్తుతం ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని పలువురు కోరుతున్నారు.



పారా... హుషార్

- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- జిల్లాలో పెరుగుతున్న దొంగతనాలు
- కొరవడిన పోలీసుల నిఘా
- భయాందోళనలో ప్రజలు
- చోరీ సొత్తు రికవరీ అంతంతమాత్రమే





మీరు ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళుతున్నారా.. తస్మాత్ జాగ్రత్త... దొంగలు పొంచి ఉన్నారు... మీ ఇంటిపై పక్కాగా నిఘా పెడతారు.. మీరు ఊరు విడిచి వెళ్లడం లేదు కదా.. అని ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా... కాలక్షేపం కోసం బయటకు వెళ్లినా.. బంధువుల ఇళ్లకు వెళ్లి నిర్లక్ష్యంగా ఉన్నా.. క్షణాల్లో మీ ఇంటిపై వాలిపోతారు. అధునాతనమైన ఆయుధాలతో ఇంటి తలుపులను బద్దలు కొట్టి.. ఇంటిలోని సొమ్ములను, నగదును కొల్లగొడతారు..

కడప క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోతోంది. తినీ తినక కష్టించి కూడబెట్టుకున్న సొమ్ము దొంగలపాలు కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగలు తాళాలు వేసిన ఇంటిని టార్గెట్ చేస్తూ గంటల వ్యవధిలోనే చోరీలకు పాలపడుతున్నారు. అత్యాధునిక పరికరాలతో పక్కింటి వారికి కూడా అనుమానం రాకుండా దొంగలు తమ చేతివాటాన్ని చూపిస్తున్నారు. అసలే వేసవి కాలం కావడంతో చాలా మంది ఆరుబయట, ఇంటి మిద్దెలపై నిద్రిస్తుంటారు. ఇదే అదనుగా భావించి ఇళ్లలో చొరబడి చోరీలకు పాల్పడుతున్నారు. జిల్లాలో రోజూ ఏదోక ప్రాంతంలో దొంగతనాలు జరుగుతున్నా పోలీసుల నిఘా కొరవడింది. ఇక చోరీ సొత్తు రికవరీ కూడా అంతంతమాత్రమే అవుతోంది.

పోలీసు నిఘా అంతంత మాత్రమే...

జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పోలీసు నిఘా అంతంత మాత్రమే ఉంది. ప్రతి పోలీసుస్టేషన్‌లో కొంతమంది ఐడీ పార్టీ పోలీసులు తిరుగుతుంటారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి ఒక వేళ దొంగ దొరికితే వారితో రికవరీ చేయించి బాధితులకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే ఐడీ పార్టీ పోలీసులు ప్రతి స్టేషన్‌లో ఉన్నప్పటికీ దొంగలను పట్టుకోవడంలో విఫలమవుతున్నారు. ఇక సీసీఎస్ పోలీసుల నిఘా ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడ దొంగతనాలు జరిగినా సంబంధిత పోలీసులు దొంగలను గుర్తించడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో సిబ్బంది కొరత వేధిస్తోంది. నేరస్తులపై నిఘా ఉంచాలన్నా, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నా సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండాలి. అయితే ఏళ్ల తరబడి సిబ్బంది కొరత ఉండడంతో ఉన్న సిబ్బందితోనే విధులను నెట్టుకొస్తున్నారు. దీంతో దొంగతనాలపై నిఘా ఉంచలేకపోతున్నారు. ఇక జిల్లాలో మొత్తం ఏడు ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలే పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. కడప నగరంలో రోడ్ విస్తరణలో భాగంగా సీసీ కెమెరాలు కనెక్షన్లు తొలగించడం, దీంతో నగరంలో 14 చోట్ల మినహాయిస్తే ఎక్కడా కూడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

ఇతర రాష్ట్రాల వారే దొంగలు

గతంలో పోలీసులు ఒక దొంగతనానికి వెళితే ఆ దొంగతనం ఎవరు చేశారన్నది వేలిముద్రలు పట్టి గుర్తిస్తుండేవారు. అయితే ప్రస్తుతం టెక్నాలజీ మారడం, ఎంతటి తలుపు అయినా బద్దలు కొట్టే పరికరాలు రావడంతో దొంగతనాలు సులువుగా చేసేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ పాగా వేసి వారు ఇళ్లలోకి చొరబడి దొరికిన కాడికి దోచుకుని తమ రాష్ట్రానికి పారిపోతున్నారు. దీంతో పోలీసులు వారిని గుర్తించలేకపోతున్నారు.

జిల్లాలో ఇటీవల జరిగిన దొంగతనాలు ఇలా...

- ఈ ఏడాది మార్చి 9న ప్రొద్దుటూరులోని ఓ ఇంటిలో చోరీకి పాల్పడి దాదాపు 80 తులాల బంగారు నగలతో పాటు రూ.7 లక్షల నగదును దోచుకెళ్లారు.
- మార్చి 19న వేంపల్లెలో పట్టపగలే ఓ ఇంటిలో దోపిడీ చేశారు. రూ.10 లక్షలు విలువ చేసే బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు.
- ఏప్రిల్ 17న ప్రొద్దుటూరులో ఒకే రోజు నాలుగు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తం 60 తులాల మేర బంగారు నగలు, 3 కేజీలు వెండి, రూ.12 లక్షల నగదును అపహరించారు.
- ఇటీవల కడప నగరంలోని ఓంశాంతినగర్‌లో ఓ న్యాయవాది ఇంట్లో దొంగలు పడి భారీగా బంగారం, నగదును దోచుకెళ్లారు. అలాగే ఫక్కీరుపల్లెలో నివాసం ఉంటున్న ఓహోంగార్డు ఇంట్లో కూడా భారీ ఎత్తున బంగారం, నగదు దొంగలు ఎత్తుకెళ్లారు.

తాళాలు వేసిన ఇంటినే టార్గెట్ చేసుకుని పగలు రాత్రి తేడా లేకుండా ఈ దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి దొంగతనాలను అరికట్టి, చోరీలో పోయిన సొత్తులను రికవరీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూడు కోర్టులకు శాశ్వత అడ్వాన్సు నిధులు మంజూరు

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని మూడు న్యాయస్థానాలకు నిర్వహణ వ్యయం కోసం శాశ్వత అడ్వాన్సు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. కడపలోని పోక్సో ప్రత్యేక కోర్టుకు రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ.3000, బద్వేలులోని సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్)కు రూ.2000, కడపలోని ఏడవ అదనపు జిల్లా కోర్టు (మహిళలపై జరిగే నేరాల విచారణకు ప్రత్యేక కోర్టు)కు రూ.3000 వంతున శాశ్వత అడ్వాన్సు నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశారు.

గరుడ వాహనంపై నారాపురం వేంకటేశ్వరస్వామి



జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం 5వ రోజు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో శ్రీవారికి మోహిని ఉత్సవం చేశారు. అనంతరం స్నపన తిరుమంజసం, ఊంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి అలంకరణ మండపంలో గరుడవాహనంపై అలంకరించి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పండితులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృతి



పులివెందుల, మే 15 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం కోరవానిపల్లెకు చెందిన గొర్ల కాపరి బొబ్బూరి చంద్రశేఖర్ (26) పిడుగుపడి మృతి చెందాడు. వివరాలిలా.. బొబ్బూరి చంద్రశేఖర్ ఆళ్లగడ్డ మండలం చిన్న బోదనం తిప్పనపల్లె గ్రామాల మధ్య తన గొర్ల దొడ్డిలో కాపలాకోసం నిద్రించాడు. బుధవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా పిడుగుపడి మరణించాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి



దొరబాబు మృతదేహం

మైలవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి గురువారం ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దకొమెర్ల గ్రామానికి చెందిన తెల్లదొరబాబు (23) అనే యువకుడు గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్ లోడు తీసుకుని రాత్రి 11.30 గంటలకు కోవెలకుంట్లకు బయ లుదేరాడు. గ్రామ సచివాలయ సమీపంలోని చిన్నకొమెర్లకు వచ్చే రహదారిలో ట్రాక్టర్ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతోపక్కనే ఉన్న గుంతలో పడి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో టైరుకింద పడిన దొరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దొరబాబు తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెంగళూరులో రైలుకింద పడి యువకుడి..



శివానందరెడ్డి (ఫైల్)

కలసపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన బిజివేముల శివానందరెడ్డి (25) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో రైలుకింద పడి మృతి చెందాడు. నందిపల్లె గ్రామానికి చెందిన పుల్లారెడ్డి కుమారుడు శివానందరెడ్డికి 9 నెలల క్రితం పోరుమామిళ్ల మండలానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఇతను కేఆర్‌పురం సమీపంలోని రైలు పట్టాలపై గురువారం శవమై కనిపించినట్లు బంధువులు తెలిపారు. శివానందరెడ్డి మృతితో మహానందిపల్లెలో విషా దచ్ఛాయలు అలుముకున్నాయి.

తెలుగుగంగ కాల్వలో గుర్తుతెలియని శవం

కలసపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని ఆర్‌సీఎం చర్చి వెనక భాగంలో ఉన్న తెలుగుగంగ కాల్వలో గురువారం ఓ గుర్తు తెలియని శవం లభ్యమైంది. మృతుడి వయసు 60 సంవత్సరాలకు పైబడి ఉంటుందని, కాషాయవస్త్రాలు ధరించి ఉన్నారు. గుర్తు పట్టలేని విధంగా కుళ్లి ఉన్న శవాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ తిమోతి పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు



పట్టుబడిన వ్యక్తులతో సీఐ శివశంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్

దువ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. దువ్వూరు మండలం ఏకోపల్లె గ్రామంలో ఈనెల 12వ తేదీ స్థలం విషయమై జరిగిన ఘర్షణలో కందుకూరి నారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసు విషయంలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మైదుకూరులోని ఓ హోటల్ వద్ద గురువారం తెల్లవారుజామున నిందితులను అరెస్టు చేసి.. కోర్టుకు హాజరుపరు స్తున్నట్లు సీఐతోపాటు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

రాళ్లదాడి హత్యపై డీఎస్పీ విచారణ

చక్రాయపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి కోమటిపేటకు చెందిన కందుల చంటి అనే యువకుడి హత్య కేసుకు సంబంధించి గురువారం డీఎస్పీ మురళీనాయక్ విచారణ చేపట్టారు. చంటిని ముగ్గురు వ్యక్తులు రాళ్లతో దాడి చేసి హత్య చేయడంతో వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం హత్య జరిగిన సంఘటన స్థలానికి సీఐ ఉలసయ్య, ఎస్ఐ చంద్రశేఖర్‌లు వెళ్లి పరిశీలించారు.

ఘర్షణ కేసులో నలుగురు అరెస్టు

జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూర్వపు బొమ్మేపల్లెలో ఈనెల 10వ తేదీ సాయంత్రం ఇంటి ముందు పేడనీళ్లు చల్లే విషయంలో ఇరువర్గాల వారు గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో 13 మంది గాయపడగా... ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజచౌడప్ప (30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి గురువారం బొగ్గు మల్లికార్జున, శివకృష్ణ, మునేశ్వరుడు, నాగేంద్ర అనే నలుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, వారి సిబ్బంది పాల్గొన్నారు.

కడప పశు సంవర్ధక శాఖ డీడీ అచ్చన్న హత్య కేసులో ప్రత్యేక కౌన్సిల్ నియామకం

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చిన్న అచ్చన్న 2023లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదించడానికి ప్రత్యేక కౌన్సిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) నివేదిక మేరకు ఈ నియామకం చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. క్రైమ్ నంబరు 113/2023లో కడప 1వ పోలీసు స్టేషన్‌లో ఈ హత్య కేసు నమోదయ్యింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు కూడా జతచేశారు. ఈ కేసు కడప నాలుగవ అదనపు జిల్లా జడ్జి (ఎస్సీ ఎస్టీ కోర్టు) విచారణలో వుంది. ప్రభుత్వం తరఫున ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించడానికి స్థానిక బార్ అసోసియేషన్ సభ్యుడు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ మూర్తిని ప్రత్యేక కౌన్సిల్‌గా నియమించింది. ఈ మేరకు డీజీపీ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కూడా ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఏ తెలుగు, హిస్టరీ, పీఎస్ అండ్ పీఏ, ఎకనామిక్స్, ఉర్దూ ఎంకామ్ కోర్సులలో విద్యార్థులు వంద శాతం ఫలితాలను సొంతం చేసుకున్నారని తెలి పారు. అఫిలియేటెడ్ కాలేజీల్లో ఎంకామ్‌లో 96.30 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఎమ్మెస్సీ బోటనీ, బయోకెమిస్ట్రీ, జియాలజీ, మేథమేటిక్స్ మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్ మెంటల్ సైన్స్, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్, ఫుడ్ టెక్నాలజీ, ఎంపీఈడీ కోర్సులలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఫిజిక్స్ 90శాతం, జువాలజీ 96.97 శాతం, బయోటెక్నాలజీ 97.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ పాల్గొన్నారు.

గోపవరం మండలంలో జేసీ పర్యటన

గోపవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంఐజీ లేఅవుట్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సందర్శించి పరిశీలించారు. ఎంఐజీ లేఅవుట్‌లో భూములు కోల్పోయిన వారికి అసైన్‌మెంటు ద్వారా కేటాయించిన భూములను పరిశీలించారు. ప్రాజెక్టు కాలనీ-2లో రేషన్‌షాపును తనిఖీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధి కారి చంద్రమోహన్, కుడా సెక్రటరీ శిరీషా, త్రిభువన్‌రెడ్డి గోపవరం తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ

- అంతకు ముందు ద్విచక్ర వాహనం, బస్సును సైతం ఢీ
- ఐదుగురికి గాయాలు ● మద్యం మత్తే కారణం



వల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో లారీని నడిపిన డ్రైవరు ఒక ద్విచక్ర వాహనాన్ని, ఆ వెంటనే ప్రైవేటు బస్సును ఢీకొట్టి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కిరాణా బంకును, దాని పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో ఐదుగురికి గాయాలు కాగా.. కిరాణా బంకుతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, బస్సు దెబ్బతిన్నాయి. వివరాలిలా.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిరుమలపురానికి చెందిన లారీడ్రైవరు షేక్ అబ్దుల్లా అహ్మద్ గురువారం కడప నుంచి లారీలో గుజరీ సామాన్లను లోడు చేసుకుని తాడిపత్రి వైపునకు వెళుతున్నాడు. మద్యం మత్తులో ఉన్న ఇతను మండల పరిధిలోని పాపాఘ్నినగర్ (కట్ట) బస్టాపు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఆ వెంటనే ఓ ప్రైవేటు బస్సును, అనంతరం రోడ్డు పక్కన చిల్లర దుకాణం బంకును, దాని పక్కనే పార్కు చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను తొక్కించాడు. చివరకు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో క్యాబిన్‌లోనే డ్రైవర్ ఇరుక్కుపోయాడు. స్థానికులు అతన్ని బయటికి తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పెద్ద ఓబన్న సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు డ్రైవరును బయటికి తీశారు. చికిత్స కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

మహిళ కడుపు నుంచి 8 కేజీల కణితి తొలగింపు



మహిళ కడుపులో నుంచి తొలగించిన కణితిని చూపుతున్న రిమ్స్ వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్)లో ఓ మహిళ కడుపు నుంచి 8 కేజీల కణితిని తొలగంచినట్లు గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ సుశీల తెలిపారు. ఆమె మాట్లాడుతూ 46 ఏళ్ల దర్బార్‌బబి అనే మహిళ కడుపునొప్పి, ఉబ్బరంతో శనివారం ఆసుపత్రిలో చేరారన్నారు. పరీక్షల అనంతరం వైద్యులు సర్వైకల్ ఫైబ్రాయిడ్‌గా నిర్ధారణ చేశారని, మంగళవారం క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అమానుల్లా నేతృత్వంలో వైద్య బృందం మూడు గంటల పాటు శ్రమించి 8కేజీల గర్భాశయ ముఖద్వారం ద్వారా కణితిని తొలగించారన్నారు. రోగి కోలుకున్నారని, రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ అమానుల్లాతో పాటు గైనకాలజీ వైద్యులు డాక్టర్ లక్ష్మీ సుశీల, డాక్టర్ రబ్బాని బేగం, డాక్టర్ మాధవి, అనస్థీషియా విభాగం వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ వర సుబ్రమణ్యం, యూరాలజీ విభాగం వైద్యులు డాక్టర్ శ్రీదీప్ పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

- పెళ్లైన నాలుగు నెలలకే ఆత్మహత్యకు దారితీసిన వైనం



అర్షియాబేగం మృతదేహం

పులివెందుల, మే 15 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని నగరిగుట్టకు చెందిన అర్షియా బేగం (18) భర్త ఫయాజ్ ఫకృద్దీన్ చిత్రహింసలు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... పట్టణంలోని నగరిగుట్టకు చెందిన అర్షియాబేగం అదే ఏరియాకు చెందిన ఫయాజ్ ఫకృద్దీన్ ఇరువురు ప్రేమించుకొని ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకున్నారు. ప్రేమించిన వాడితో జీవితం సంతోషంగా ఉంటుందని అర్షియాబేగం భావించింది. వివాహం చేసుకున్న మరుసటి రోజు నుంచే భర్త వేధింపులు మొదలయ్యాయి. అర్షియాబేగం తల్లి జైబున్నిషా దుబాయ్‌లో ఉంటోంది. తండ్రి కరీముల్లా తిరుమలలో ఓ షాపులో పని చేస్తుంటారు. అర్షియాబేగం తన అమ్మమ్మ అయిన బున్ని దగ్గర ఉండేది. పెళ్లిచేసుకున్న నాటి నుంచి అర్షియాబేగంను భర్త చిత్రహింసలు పెట్టడం ప్రారంభించారు. అర్షియాబేగం అమ్మమ్మ బున్నీని డబ్బుల కోసం ఇబ్బందులు పెట్టేవాడు. ఇటీవల కొంతమొత్తాన్ని తీసుకొని బైకు కూడా కొనుగోలు చేశాడు. ఫయాజ్ ఫకృద్దీన్ ఓ చికెన్ షాపులో పని చేస్తుంటాడు. బుధవారం రాత్రి డబ్బు కోసం అర్షియాబేగంతో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన అర్షియాబేగం ఉరివేసుకొని చనిపోతానని భర్తకు చెప్పింది. కానీ భర్త ఆమె మాటలను పట్టించుకోకపోవడంతో బుధవారం అర్ధరాత్రి వంట రూములోకి వెళ్లి అర్షియా బేగం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఒక నెల వేతనం

కడప ఎర్రముక్కపల్లె, మే 15(ఆంధ్రజ్యోతి): భారత సైనిక శక్తిని మరింత బలోపేతం చేయడానికి, వారికి మన వంతు ఉడతాభక్తిగా సాయం చేయడానికి తన వంతుగా ఒక నెల వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు అందిస్తున్నట్లు ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేషన్ బియ్యం సజావుగా పంపిణీ చేయాలి

వేంపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి ఆదేశించారు. వేంపల్లెలోని గండిరోడ్డులో ఉన్న 8వ రేషన్‌షాపును గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, పంపిణీ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ లోకేష్, వీఆర్వో సుబ్బరాయుడు ఉన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

వేంపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని తాళ్లపల్లె పీహెచ్‌సీ హెచ్‌ఈ షఫీఉన్నీసా తెలిపారు. వేంపల్లెలోని 1వ అంగన్వాడీ కేంద్రంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. టీనేజీలో గర్భవతి కావడం మంచిది కాదన్నారు. శారీరకంగా, మానసికంగా టీనేజీ యువతులు సిద్ధంగా ఉండరని గర్భందాల్చితే తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఏఎన్ఎం లక్ష్మీదేవి, మహిళా పోలీస్ అర్చన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై నేడు గ్రామసభ

● ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

లింగాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శుక్రవారం ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉద్యానపంటల సాగు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పండ్ల తోటల సాగుచేసే రైతులకు రాయితీలు ఇస్తోందన్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

వైసీపీ పాలనలో సాగిన నకిలీ ఉద్యోగాల

అవినీతి దందాను వెలికితీయాలి

● బాధితుల నుండి వసూలు చేసుకున్న డబ్బులను తిరిగి ఇప్పించాలి ● లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా ● ఆర్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఎన్.రవిశంకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన చివరి దశలో (ఎన్నికలకు ముందు) నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ నేషనల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ అనే సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది నిరుద్యోగుల వద్ద లక్షలాది రూపాయలు దండుకున్నారని, ఈ నకిలీ ఉద్యోగాల అవినీతి దందాను వెలికితీయాలని ఆర్సీపీ రాష్ట్ర నాయకుడు నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 22 మంది నిరుద్యోగులు ఒక్కొక్కరి నుండి రూ.6.50లక్షలు వసూలు చేశారన్నారు. నిరుద్యోగుల వద్ద నుండి లక్షలాది రూపాయలు దండుకోవాలనే ఏకైక లక్ష్యంతో ఆ ట్రస్ట్ నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్, నకిలీ మెయిల్స్ సృష్టించి కస్తూర్బా, ఆదర్శ, ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో అభ్యర్థులను ఉద్యోగాలలో చేర్పించారన్నారు. ఒకటి, రెండు నెలల పాటు వారితో ఉద్యోగం చేయించుకుని జీతాలు కూడా ఇచ్చారన్నారు. కాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విజిలెన్స్ విచారణలో ఆ నియామకాలు నకిలీవని తేల్చి చెప్పడం జరిగిందన్నారు. ఈ విషయంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా నిగ్గుతేల్చడంలో వైఫల్యం చెందిందన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం కూడా రోజుకోమాట మాట్లాడడం విడ్డూరంగా వుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని, బాధితులకు వారిచ్చిన డబ్బులు తిరిగి ఇప్పించాలన్నారు. లేనిపక్షంలో త్వరలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామన్నారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి : పీడీఎస్‌యూ



ఆర్ఐవో వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్ఐవో వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ ఏ ఒక్క కార్పొరేట్ కళాశాలకు కూడా హాస్టల్ అనుమతి లేకపోయిన హాస్టల్ పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి కార్పొరేట్ జూనియర్ కళాశాలలను కట్టడి చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా నాయకులు వెంకటేశ్, అఖిల్ నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి

పెండ్లిమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులను రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి ఓబులేసు దుకాణదారులకు సూచించారు. మండల పరిధిలోని నందిమండలం, వెల్లటూరు గ్రామాలలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను గరువారం ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా డీలర్లు బిల్లు ఇవ్వాలని, నిషేధిత మందులు విక్రయించరాదన్నారు.

అవినీతి మేయర్‌పై అనర్హత వేటు హర్షణీయం

కడప మారుతీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప నగర మేయర్ సురేశ్‌బాబుపై రాష్ట్ర మున్సిపల్‌శాఖ అనర్హత వేటు వేయడం హర్షణీయమని టీడీపీ నాయకుడు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు కార్పొరేషన్‌ను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రజల సొమ్మును ఇష్టానుసారంగా దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అవినీతి అరాచకాలకు తావు ఉండదన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమే రాష్ట్ర మున్సిపల్ శాఖ నిరూపించిందన్నారు.

ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కడప మారుతీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): 16 సంవత్సరాలుగా తాను ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్నానని, కాగా తన ఇంటి పక్కన ఉన్నవారు మానసిక క్షోభకు గురి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, తక్షణమే వారిపై తగు చర్యలు తీసుకోవాలని వల్లూరు మండలం తోళ్లగంగనపల్లె నివాసి ఆనందరావు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కడపలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విషయంగా తాను పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి బహుజనుల ద్రోహులు

● దళిత ఫోరం కన్వీనర్ కిషోర్ బూసిపాటి

కడపనాగరాజపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఆమె భర్త టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి బహుజనుల ద్రోహులని దళిత ఫోరం కన్వీనర్ కిషోర్ బూసిపాటి విమర్శించారు. కడపలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కడపను అభివృద్ధి చేస్తామంటూ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక బహుజనులపై కక్ష సాధింపు చర్యలు తప్ప వారు చేసిన అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. ఒక బీసీనేత మేయర్‌గా ఉండడం చూసి ఓర్వలేకే ఆయనపై అనర్హత వేటు వేయించారని మండిపడ్డారు. గడిచిన ఏడాది కాలంగా ఎంతో విలువైన సమయాన్ని కార్పొరేషన్‌లో కుర్చీ కోసం కొట్లాడడానికి మాత్రమే సరిపెట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో అఖిలభారత అంబేడ్కర్ ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, మే 15 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నాటి కార్మికులు పోరాడి సాధించిన కార్మిక హక్కులను, చట్టాలను హరించి తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, కె.శ్రీనివాసులరెడ్డి సంయుక్త అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, శ్రమజీవులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు సుబ్రమణ్యం అన్వేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, ఆశావర్కర్స్ యూనియన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ చూపాలి

సీకేదిన్నె, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పోషించే పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వైద్యాధికారి పాండురంగ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల గ్రామంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా గురువారం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి పిడుదుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 125 పశువులకు ఈ మందును పిచికారి చేయడం జరిగిందన్నారు. దీంతో పశువులు గోమార్ల బాధ నుండి ఉపశమనం పొందుతాయని, లేగదూడలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశామన్నారు. పశువులకు ఇన్సురెన్స్ చేయించుకోవాలని పశువైద్య సహాయకులు నవ్య తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గండిలో లక్ష లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు

చక్రాయపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో లక్ష లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. కడపలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో చక్రాయపేట జడ్పీటీసీ టి.శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా పరిషత్ ఛైర్మన్ రామగోవిందరెడ్డి, సీఈవో ఓబులమ్మ నిధులు మంజూరు చేశారు. ట్యాంక్ నిర్మాణ విషయంపై గతంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నిధులు మంజూరుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ఆలయ పాలక మండలి ధన్యవాదాలు తెలిపారు.

పరిశుభ్రమైన వాతావరణం ముఖ్యం

కడప (వినాయకనగర్), మే 15(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాధ్ తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం, బీట్ ది హీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అంకాల నాగరాజు, శివరామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

చెన్నూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై చెన్నూరు బస్టాండు కూడలిలో గురువారం కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం అధ్యక్షుడు కె.జయశంకర్ మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత రక్తాలు, హెచ్ఐవీ సోకిన తల్లి నుండి బిడ్డకు సురక్షితం కాని బ్లేడ్లు, సిరంజీల ద్వారా హెచ్ఐవీ సోకుతుందన్నారు. హెచ్ఐవీ సోకిన ప్రతి వ్యాధిగ్రస్తునికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందన్నారు. అలాగే హెచ్ఐవీపై అనుమానం కలిగిన వ్యక్తుల కోసం 1095 టోల్‌ఫ్రీ నెంబరు ఉందని, ఇది 24గంటలు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'దాతల సహకారం వెలకట్టలేనిది'

పెండ్లిమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి దాతల సహకారం వెలకట్టలేనిది చెర్లోపల్లె సర్పంచ్ గంగిరెడ్డి తెలిపారు. పగడాలపల్లె గంగమ్మ దేవస్థానంలో కీర్తిశేషులు రమ్మీ చెన్నారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనవళ్లు, మనవరాళ్లు భక్తులకు సౌకర్యార్థం సత్రం నిర్మించారు. ఈ సత్రాన్ని గురువారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేయవలసిందిగా కోరారు.

కనుల పండువగా లక్ష కుంకుమార్చన

కడప కల్చరల్, మే 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని అమ్మవారిశాల వీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఈనెల 14 నుండి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న అమ్మవారి మహా కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్నుల పండువగా లక్ష కుంకుమార్చన పూజలు జరిగాయి. ముందుగా ప్రదోషపూజ, మంత్రజపం, అనుషంగిక హోమాలు, వేదపారాయణములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శత చండీ పారాయణం, మహా లింగార్చన, సూర్యనమస్కారాలు, వాసవీమాతకు విశేష అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉర్దూ పోస్టులను యదావిధిగా కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్, మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో ఉర్దూ పోస్టులను యదావిధిగా కొనసాగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం కడప నగరంలో ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఐదు తెలుగు మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూను ఒక సబ్జెక్టుగా కొనసాగిస్తూ వస్తున్నారని, ప్రస్తుతం జరిగే ఉపాధ్యాయుల సర్దుబాటులో ఈ పాఠశాలల్లో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్‌ను తొలగించడం సరైందికాదని, వెంటనే ఆ పోస్టును యదావిధంగా కొనసాగించాలని డిమాండు చేశారు.

ఘనంగా దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలు

కడప ఎర్రముక్కపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం విజయదుర్గాదేవి ఆలయంలో, దుర్గా ఆటోమోటివ్స్ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో దుర్గా మల్లికార్జునరావు, స్వామి సెక్యూరిటీ సర్వీసెస్ అధినేత ముమ్మడి రామాంజనేయులు, జనసేన నాయకులు జీవీ రమణ, తోట సుమన్, రామకృష్ణ, తులసీదాస్, పాలకొండయ్య, టీడీపీ, జనసేన, బలిజ సంఘం నాయకులు, మిత్రులు అభినందనలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న దుర్గాప్రసాద్, దుర్గా మల్లికార్జునరావు.. అభినందిస్తున్న జీవీ రమణ

రూ.1.50కోట్లతో తాగునీటికి పరిష్కారం

● బోరును ప్రారంభించిన టీడీపీ నేతలు



పాపాఘ్నినదిలో బోరును ప్రారంభిస్తున్న రఘునాథరెడ్డి

వేంపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.1.50కోట్లతో తాగునీటి బోర్లు, ఫిల్టర్లు వేయిస్తున్నామని టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. వేంపల్లెలోని బిడాలమిట్ట పాపాఘ్ని నదిలో నూతనంగా వేసిన రెండు బోర్లను గురువారం ఆయన ప్రారంభించారు. వేంపల్లె పట్టణంలోని పలు ప్రాంతాలకు ఈ బోర్ల ద్వారా తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ వలి, యువనాయకుడు నామా వేమకుమార్, బీసీ నాయకుడు మడక శ్రీనివాసులు, మైనార్టీ నేత ఫయాజ్, మనోహర్, జనసేన హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సీపీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్హతలకు అనుగుణంగా ఈ జాబ్‌మేళాకు హాజరైనచ్చిన ఉద్యోగంలో స్థిరపడాలని కోరారు. ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొన్నాయని, 800 నియామకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి యల్లమ్మ తల్లి జాతర

చెన్నూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే గ్రామదేవత యల్లమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఈ శుక్రవారం ప్రారంభమై మూడురోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. జూన్, జూలై మాసాల్లో వ్యవసాయ పనులు చేపడతారు కాబట్టి పంటలు బాగా పండాలని, గ్రామం ఆరోగ్యవంతంగా ఉండాలని కోరుకుంటూ ఈ జాతర నిర్వహించడం జరుగుతుంది. ఈ మేరకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్ర, శనివారాల్లో గ్రామంలో పోతులరాజు ఊరేగింపును ఆనవాయితీగా నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మధ్యాహ్నం 3 నుండి పెద్దఎత్తున పోతుల రాజు ఊరేగింపుతో పాటు పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు

చెన్నూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో ఉపాధి హామీ పనులు చేసుకునే కూలీలంతా వడదెబ్బ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో జి.సురేశ్‌బాబు అన్నారు. మండలంలోని కొక్కిరాయపల్లె గ్రామపరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. అలాగే పని ప్రదేశంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నీరు ఎక్కువగా తాగాలని, ఓఆర్ఎస్ పానీయం తాగాలని, ఏమాత్రం అలసట, ఇబ్బందులున్నా వెంటనే నీడ ప్రదేశంలోకి రావాలన్నారు. ఉదయమే పనులకు వచ్చి త్వరగా ముగించుకుని వెళ్లాలన్నారు. అలాగే తడి పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, కార్యదర్శి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటన్ దొర స్ఫూర్తితో సాగునీటికి ప్రాముఖ్యత

వేంపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): కాటన్ దొర స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాగునీటికి ప్రాముఖ్యత ఇచ్చాయని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో కాటన్ దొర జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాటన్ దొర కృషివల్లనే గోదావరి నదిపై ధవళేశ్వరం ఆనకట్ట, కృష్ణానదిపై విజయ వాడ వద్ద ఆనకట్ట, కావేరి నదిపై ఆనకట్ట నిర్మాణం జరిగిందన్నారు. శ్రీశైలం, సాగర్, ప్రకాశం బ్యారేజ్, ధవళేశ్వరం బ్యారేజ్‌లను నిర్మించి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ పార్టీ అన్నపూర్ణగా మార్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారి

సీకేదిన్నె, మే 15 (ఆంధ్రజ్యోతి): దోమల మందు పిచికారిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి మురళి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లో గురువారం మలేరియా ఎకడమిక్ గ్రామాల్లో ఏసీఎం అనే మందును పిచికారి చేశారు. దీని ద్వారా దోమలు నివారించబడి వ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి ఇళ్లల్లో ఈ మందును పిచికారి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాఘవేంద్ర, ఈవోఆర్‌డీ సుబ్బారెడ్డి, సీహెచ్‌వో సుకుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, కార్యదర్శి ప్రేమలత, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

కాల్వ, కల్వర్టు ఏర్పాటు చేయాలి

● రోడ్డుపై తాళ్లపల్లె ప్రజల నిరసన

వేంపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప తమ సమస్య పరిష్కారం కావడం లేదంటూ తాళ్లపల్లె ప్రజలు రోడ్డుపై ఉన్న వర్షపునీటిలోనే గురువారం నిరసన తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు కూడలిగా ఉన్న తాళ్లపల్లె-వెలమవారిపల్లె రహదారిలో వేంపల్లె, పులివెందుల రోడ్డు ఆనుకొని ఉన్న ప్రాంతంలో నీళ్లు నిలిచి నడిచేందుకు, వాహనాలు వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కల్వర్టు నిర్మించి కాల్వ ఏర్పాటు చేస్తే నీళ్లు నిలవకుండా వెళ్తాయని స్థానికులు కోరుతున్నారు.



వర్షపునీటిలో నిరసన తెలుపుతున్న తాళ్లపల్లె గ్రామస్థులు

గాలీవాన బీభత్సం

● నేలకొరిగిన స్తంభాలు, విరిగి పడ్డ చెట్లు
● యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



విరిగి పడ్డ చెట్టు



విద్యుత్ స్తంభం

ముద్దనూరు మే15(ఆంధ్రజ్యోతి):మండలంలో బుధవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో గ్రామాల్లో చెట్లు విరిగిపడడంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని ముద్దనూరు, వేల్పుచర్ల, ఉప్పలూరు, మాదన్నగారిపల్లె,పెనికెలపాడు, రాజులగురువాయపల్లె, కొసినేపల్లి గ్రామాల్లో భీకరమైన గాలులతో పాటు అకాల వర్షం కురిసింది. ఉప్పలూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33కేవికి సంబంధించిన 3స్తంభాలు ,11కేవి, ఎల్‌టీ లైన్‌కు సంబంధించిన 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.అలాగే వేప చెట్లు కూకటివేళ్లతో సహా విరిగి పడడంతో విద్యుత్ కు అంతరాయం ఏర్పడింది. 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరుణ చర్యలు చేపట్టారు.

థ్యాంక్యూ సీఎం సార్

మైదుకూరు రూరల్ ,మే 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్నటు వంటి 8వేల 427 మంది పాస్టర్ల 7 నెలల వేతనాలను విడుదల చేసిన ముఖ్యమంత్రికి మైదుకూరు పాస్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక బద్వేల్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం పాస్టర్ల సమావేశం జరిగింది. ఇందులో ఫాస్టర్ల 7 నెలల గౌరవ వేతనం విడుదల చేయటంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శాంతినగర్ ప్రసాద్, పాస్టర్లు యేసురత్నం, రవిబాబు,ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఇనుప స్తంభాలు తొలగించరా..?

● ప్రమాదకరంగా మారిన విద్యుత్ ఇనుప స్తంభాలు ● కొన్ని చోట్ల ఇళ్లపై ఒరిగిన వైనం ● ఆందోళనలో పట్టణ ప్రజలు

జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి):రెవెన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రంతోపాటు నగర పంచాయతీగా ఉన్న జమ్మలమడుగు పట్టణంలో విద్యుత్ ఇనుప స్తంభాలు ప్రమాదరకరంగా మారిన పట్టించుకునేవారు లేరు. పట్టణంలో సాధారణంగా జనం రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో పాతకాలంనాటి ఇనుప స్తంభాలనే ఇంకా కొనసాగించడం పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద నుంచి పెద్దమ్మ విగ్రహం, మెయిన్‌బజార్, వాసవీ కన్యకపరమేశ్వరీదేవి ఆలయం, అంబాభవానీ దేవాలయం వీధి, పలగాడి వీధిలో ఇనుప స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. ఇటీవల జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి శ్రీ నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జమ్మలమడుగుకు 300 విద్యుత్ స్తంభాలు ఇప్పించానని ఎక్కడైనా సమస్య ఉంటే వాటిని ఉపయోగించుకుని పరిష్కారం చేయాలని చెప్పినా మరెందుకో ఆదిశగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. గత నెల రోజుల నుంచి పట్టణంలో విద్యుత్తు శాఖ కార్యాలయ ఆవరణలో సిమెంటు స్తంభాలు ఉన్నప్పటికి ఒరిగిన విద్యుత్తు ఇనుప స్తంభాలను మార్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కూరగాయల మార్కెట్ వద్ద ఇనుప స్తంభానికి సపోర్టుగా కిందపడకుండా పెట్టినట్లుగా స్థానికులు తెలిపారు. అలాగే పెద్దమ్మ విగ్రహం వద్ద, మెయిన్‌బజార్‌లో ఇనుప స్తంభాలు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్త సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈనెల 17వ తేదీ రథోత్సవం ఉన్నందున సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మెయిన్‌బజార్‌లో ఇంటిపై వాలిన ఇనుప విద్యుత్ స్తంభం

ఏడీఈ ఏమన్నారంటే: విద్యుత్ ఇనుప స్తంభాల తొలగింపు విషయమై జమ్మలమడుగు విద్యుత్ శాఖ ఏడీఈ రాజగోపాల్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నారాపురం స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత పనులు చేపడతామన్నారు. స్తంభాలు తొలగించాలంటే రోడ్డును పగులగొట్టి పనులు చేయాల్సి ఉంటుందన్నారు.

సీఎంను కలిసిన చెరుకూరి రవి



బద్వేలు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును గురువారం బద్వేలు నియోజకవర్గ యువ నాయకుడు చెరుకూరి రవికుమార్‌నాయుడు కుటుంబ సమేతంగా సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బద్వేలు నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. పోరుమామిళ్ల పట్టణంలో త్వరలో ఒక ఐటిఐ కళాశాలను మంజూరు చేయాలని, మెయిన్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గంలో కార్యకర్తల కష్టాన్ని గుర్తించాలని కోరామన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

జాబ్‌ప్లేస్‌మెంట్‌కోసం ఒప్పందం

ప్రొద్దుటూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదివే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి దేశ్‌పాండే స్కిల్లింగ్ సంస్థతో ఎస్వీ డిగ్రీ కళాశాల నిర్వాహకులు గురువారం ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఎస్వీ డిగ్రీ కళాశాల నిర్వాహకులు దేశ్‌పాండే స్కిల్లింగ్ సంస్థతో ఒప్పందం చేసుకోవడం అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ హరినారాయణ, కళాశాల డైరెక్టర్ పృథ్వీనారాయణ, కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, వైస్‌ప్రిన్సిపాల్ శారదాభవానీ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): శ్రీనారాపురం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భక్తులకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు అన్నదానం చేశారు.కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, నవనీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం

జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరగుడి చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన 11 ఎకరాల భూమికి గురువారం ఆలయం వద్ద బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. 2025-26, 2027-28 సంవత్సరానికి సంబంధించి మూడు సంవత్సరాలకు వేలంపాటలు నిర్వహించారు. అందులో సర్వే నంబరు 69లో 1.96 ఎకరాల భూమికి గతంలో రూ.4 వేలు ఆదాయం ఉండగా ప్రస్తుతం వేలంలో రూ.13 వేలకు చల్లా వెంకటరామిరెడ్డి దక్కించుకున్నారు. సర్వే నంబరులో 184/1లో 1.48 ఎకరాల భూమికి గతంలో రూ.4 వేలు ఉండగా ప్రస్తుతం రూ.26 వేలకు టంగుటూరి నడిపి నరసింహారెడ్డి దక్కించుకున్నారు. సర్వే నంబరు 184/2, 184/3లో 2.38 ఎకరాలు, 0.96 ఎకరాలకు గతంలో పది వేలు ఉండగా ప్రస్తుతం రూ.50 వేలకు టంగుటూరి బాలసుబ్బారెడ్డి పాట దక్కించుకున్నారు. సర్వే నంబరు 228/2లో 2.37 ఎకరాలకు గతంలో రూ.5వేలు ఉండగా రూ.1.70 లక్షలకు చౌడం జొల్లు కొండయ్య దక్కించుకున్నారు. దీంతో ఆలయానికి రూ.2.59 లక్షలు భారీగా ఆదాయం వచ్చినట్లుగా అధికారులు తెలిపారు.

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం తోడ్పాటు

జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలను సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా తోడ్పాటు అందించనున్నట్లు వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పంచాయతీ సెక్రటరీలకు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈనెల 16, 23 తేదీల్లో ఉపాధి ఉద్యానశాఖవారి సమన్వయంతో గ్రామసభలు నిర్వహించి 25 రకాల పంటలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జ్ఞాన సుందరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం -3లో గురువారం మహిళలకు ఉచితంగా 90 రోజుల పాటు కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎంపీడీవో వీరకిశోర్, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్ అందించి వారి కుటుంబ జీవనోపాధి కోసం కుట్టుమిషన్‌ను అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెల్లటూరు సాంబశివారెడ్డి, సర్పంచ్ చిలమల నారాయణ, పూజ శివయాదవ్, కోటేశ్వర్‌రావు, బి.నారాయణ, టీడీపీ ఉపాధ్యక్షుడు నరసింహగౌడ్, నాగిపోగు గంగయ్య, దేవరకొండ సురేంద్ర, నాగయ్య, బోగా వీరయ్య పాల్గొన్నారు.

'అమ్మవారి ముందు క్షమాపణలు చెప్పితే సరి'

పోరుమామిళ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఎదుట గొర్లమందల తప్పులు క్షమించమని కోరి మినిట్స్ బుక్‌లో సంతకం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథుల ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో మూడేళ్లక్రితం అతను అమ్మవారిశాల లో కార్యదర్శిగా ఉన్నప్పుడు, వైస్ ప్రెసిడెంటుగా ఉన్నప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో అలాంటి నిర్ణయాలే ఇప్పుడు కూడా కమిటీ తీసుకుందన్నారు. అంతేకాక తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టినందుకు ఇప్పటి వరకు అయిన కోర్టు ఖర్చులు అన్నీ భరాయిస్తే తిరిగి కమిటీ ఆయనకు మిగిలిన ఆర్యవైశ్యు ల మాదిరిగానే గౌరవ మర్యాదలు దక్కుతాయన్నారు. కాగా ఆర్యవైశ్యుడిని అయిన తనకు కన్యకాపరమేశ్వరి ఆలయంలో తీర్థ ప్రసాదాలు, హారతి ఇవ్వకుండా నిషేధించారని పోరుమామిళ్లకు చెందిన ఆర్యవైశ్య వ్యాపారి గొర్ల మందల సత్యనారాయణ గురువారం పోరుమామిళ్లలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో బైఠాయించి నిరసన తెలిపారు.

వృద్ధాశ్రమానికి రూ.30వేలు విరాళం



ఎర్రగుంట్ల, మే 15(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరులోని ఎద్దు పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమానికి ఎర్రగుంట్ల కమిషనర్ పేర్లి శేషఫణి తండ్రి పేర్లి వెంకటరంగయ్య రూ.30వేలు విరాళంగా ఇచ్చారు. కమిషనర్ తల్లి స్వర్గీయ సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థంగా అనాథాశ్రమంలో రేకుల షెడ్డును నిర్మించేందుకు ఈ విరాళం ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు.


గ్రంథాలయానికి డీఎస్సీ పుస్తకాల వితరణ

ప్రొద్దుటూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు ఆవరణంలోని పుట్టపర్తి నారాయణాచార్యుల గ్రేడ్-1 గ్రంథాలయానికి మానవతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో డీఎస్సీ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. గురువారం రూ.2,721 విలువైన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా మానవతా సేవాట్రస్టు డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ పరీక్షకు సిద్ధమయ్యే డీఎస్సీ అభ్యర్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ తిరుపతమ్మ, మానవతా సేవా ట్రస్టు విద్యాకమిటీ సభ్యుడు రమేష్, మాబు, తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించడం కాదు.. ఆవిరవుతోంది

ఖాజీపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సంపద సృష్టిస్తానని చెప్పి నిత్య సంపద ఆవిరై పోతోందని కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. గురువారం ఖాజీపేటలో విలేకరులతో మాట్లాడుతూ సంపద సృష్టిస్తానని పదే పదే చెబుతూ ఆచరణలో మాత్రం రివర్స్‌గేర్‌లో సంపద ఆవిరైపోతోందన్నారు. 2023-24లో రెవెన్యూ రాబడి రూ.1,73,963 కోట్లు కాగా 2024-25లో రూ.1,68,443 కోట్లు మాత్రమే రావడంతో రూ.5,520 కోట్లు తగ్గిపోయి ఆవిరైపోతోందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ఒట్టిమాటలు కట్టిపెట్టి సమర్థవంతంగా పరిపాలించాలని తులసిరెడ్డి పేర్కన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు రమణ, అమర్‌నాథ్‌రెడ్డి, నాగరాజు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధంకాని వస్తువులను కొనుగోలు చేయవద్దు



మాట్లాడుతున్న జడ్జి ఖాజామైనుద్దీన్

చాపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధంకాని వస్తువులను ఎవరైనా విక్రయిస్తే అలాంటివాటిని కొనుగోలు చేయవద్దని మైదుకూరు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఖాజామైనుద్దీన్ అన్నారు. గుంతచియ్యపాడు గ్రామంలో గురువారం చట్టాలపై అవగాహన కోసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దొంగ బంగారం, మోటారు సైకిళ్లు కొనుగోలు చేసినవారికి, విక్రయించినవారికి చట్టప్రకారం శిక్ష, జరిమానా విధించబడుతుందన్నారు. గ్రామీణ ప్రజలు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ఉచితంగా లాయర్లను కోర్టు నియమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగిరెడ్డి, జ్వాలా, శ్రీనివాసులు, బాలవెంకటయ్య, శివరాం, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

మైదుకూరు రూరల్ ,మే 15(ఆంధ్ర జ్యోతి) : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం మూడు నెలల పాటు ఇస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారని వివరాలకు 9398348760 నెంబరుకు కాల్ చేయాలని తెలిపారు.

మైదుకూరులో చోరీ: పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో నివసిస్తున్న నాగేంద్ర అనే వ్యక్తి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాగా ఈ చోరీపై పోలీసులు విచారణ చేపట్టారు.

అంగన్వాడీ కేంద్రాలకు భవనాల కొరత

● ఉన్న భవనాలు ఖాళీ చేయాలంటూ విద్యాశాఖాధికారుల ఆదేశాలు

ముద్దనూరు మే15(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలల ప్రాంగణంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు భవనాల కొరత ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా మార్చడంతో అందులో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఖాళీ చేయాలంటూ విద్యాశాఖాధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో సమస్య నెలకొంది. వివరాల్లోకి వెళితే...మండల కేంద్రంలోని మెయిన్, స్టేషన్ ప్రాథమిక పాఠశాలలు 2025-26 సంవత్సరానికి మోడల్ పాఠశాలలకు ఎంపికయ్యాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా ఆ పాఠశాలల ప్రాంగణంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలను అక్కడ నుంచి ఖాళీచేయాలని సూచించారు. ఇందులో మెయిన్ ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ-2, మినీ ఎస్టీ అంగన్వాడీ, స్టేషన్ ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ వార్డు-4 కేంద్రాలున్నాయి.మోడల్ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు గదులతో పాటు ఉపాధ్యాయులు ఉండడంతో అక్కడ నడుస్తున్న అంగన్వాడీలను ఖాళీ చేయాలని మండల విద్యాశాఖ అధికారులు ఐసీడీఎస్ అధికారులకు తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో గృహనిర్మాణ కార్యాలయం సమీపంలో అంగన్వాడీ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని రైతు భరోసా కేంద్రానికి ఉపయోగించుకున్నారు.ఆ భవనాన్ని తమకు అప్పగిస్తే ఒక సమస్య అయినా తీరుతుందని ఐసీడీఎస్ అధికారులు అంటున్నారు.

మోడల్ పాఠశాలలుగా మారాయి: ముద్దనూరు మెయిన్, స్టేషన్ ప్రాథమిక పాఠశాలలు మోడల్ పాఠశాలలు గా మారాయని ఎంఈవో నాగేశ్వరనాయక్ తెలిపారు. దీంతో తరగతికి ఒక గది అవసరం ఉన్నందున పాఠశాలల ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఖాళీ చేయాలని ఐసీడీఎస్ అధికారులకు తెలియజేశామన్నారు.

గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికపై సమీక్ష

ప్రొద్దుటూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల నిర్వహణాధికారి, మైలవరం డిప్యూటీ ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డి సమీక్ష జరిపారు. గురువారం స్థానిక హౌసింగ్‌బోర్డులో ఉన్న గోపవరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఈనెల 19న నిర్వహించనున్న ఉప సర్పంచ్ ఎన్నిక కోసం పంచాయతీ కార్యదర్శిని అడిగి పలు వివరాలను సేకరించారు. పంచాయతీ వార్డు సభ్యుల సంఖ్య వారిలో ఏ పార్టీ ఎంతంత బలం ఉందో వాకబు చేశారు. గతంలో ఉపసర్పంచ్ ఎన్నిక నేపథ్యంలో చోటు చేసుకున్న సంఘటనలపై సమీక్షించారు. 19వ తేదీన నిర్వహించనున్న ఎన్నికపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రశాంత వాతావణంలో ఎన్నిక జరిపేందుకు తగిన సూచనలు జాగ్రత్తలు పంచాయతీ అధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి రామక్రిష్ణ డీఎస్పీ భావనను కలిసి ఎన్నిక ప్రశాంతంగా జరిపేందుకు తగిన బందోబస్తును ఏర్పాటు చేయాలని కోరారు.

రెండు పీహెచ్‌సీలకు డీసీసీబీ చైర్మన్ రూ.లక్ష విరాళం



డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బద్వేలు ,మే 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ యువనేత రితేష్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు డీసీసీబీ నూతన చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి గురువారం గాంధీనగర్, సురేంద్రనగర్ పీహెచ్‌సీలకు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో మౌలిక సదుపాయాల కొరకు ఈ డబ్బును అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, డాక్టర్లు, హెల్త్ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందించిన విద్యార్థులతో ఫ్రెండ్స్ సేవా సంఘం సభ్యులు

బద్వేలు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనపరచిన విద్యార్థినీ విద్యార్థులకు ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో నగదుతో పాటు ప్రతిభా పురస్కారాలు అందించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని సాధన ఇంగ్లీషు మీడియం స్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 600 మార్కులకు 591 సాధించిన అతికారి దక్షిత, 582 నాగశ్రీ నిత్య, 578 హసన్, అలాగే సాధన ఇంగ్లీషు మీడియం స్కూలులో 580 మార్కులు సాధించిన సాత్విక్ 586, 584 మార్కులు సాధించిన అనిత, 560 మార్కులు సౌమ్యలకు మొదటి బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.5వేలు, 4వ బహుమతి రూ.4వేలు నగదుతో పాటు ప్రతిబా పురస్కారాలు అందించారు. అనంతరం తల్లిదండ్రులకు సన్మానం, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూలు హెడ్మాస్టరు వెంకటసుబ్బారెడ్డి, సాధన ఇంగ్లీషు మీడియం స్కూలు కరస్పాండెంట్ సముద్రాల శ్రీనివాసులు, కె.శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్షుడు యోగయ్య, ప్రధాన కార్యదర్శి గంగసాని సాంబశివారెడ్డి, జయరామిరెడ్డి, ఆయుబ్‌ఖాన్, దంత రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

బద్వేలు , మే 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఆమేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఏరియా కార్యదర్శి పీవీ రమణ మాట్లాడుతూ 20వ తేది జరిగే దేశవ్యాప్త సమ్మెను పట్టణంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక , కర్షక వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ నెల 20న జరిగే సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గురువారం వారు విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీసుబ్బారెడ్డి, సీపీఐ ఏఐటీ యూసీ, సీఐటీయూ నేతలు మనోహర్‌బాబు, వెంకటరమణ, తారాదేవి ,వరలక్ష్మి, పద్మా వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాడుగలు చెల్లించలేదని బీఈడీ కళాశాల సీజ్

ప్రొద్దుటూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవదాయ శాఖ కృష్ణ గీతాశ్రమంలోని శ్రీ మళయాలస్వామి బీఈడీ కళాశాల నిర్వాహకులు ఆరు సంవత్సరాలుగా బాడుగ చెల్లించకపోవడంతో గురువారం గీతాశ్రమం ఈవో రామచంద్రాచార్యులు కళాశాలను సీజ్ చేశారు. గీతాశ్రమంలోని డోర్‌నెం.4/672లో 7744 చదరపు అడుగుల విస్తీర్ణంలో బీఈడీ కళాశాల నిర్వహిస్తున్నారు. కళాశాల నిర్వాహకులు 2019 జూలై నుంచి బాడుగ చెల్లించడంలేదు. దీనిపై దేవదాయశాఖ చట్టం 23 (2) మేరకు 2024 అక్టోబరు 20వ తేదీ, నవంబరు 1వ తేదీ, 2025 మార్చి 3వ తేదీన ఏప్రిల్ 14వ తేదీన మరోసారిఈవో కళాశాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అయితే కళాశాల నిర్వాహకుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈవో దేవవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి రెవెన్యూ, పోలీసుల సమక్షంలో కళాశాలను సీజ్ చేశారు. కళాశాల నిర్వాహకులు మాట్లాడుతూ తమ కళాశాలకు ఇప్పటి నుంచి క్రమం తప్పకుండా బాడుగలు చెల్లిస్తామని, పాత బకాయిలను వాయిదాల్లో చెల్లించడానికి దేవదాయశాఖ అధికారులు అవకాశం కల్పించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నిందితులకు శిక్ష

బద్వేలు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): అర్బన్ పోలీసుస్టేషను పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారితోపాటు గ్యాంబ్లింగ్ మట్కా కేసుల్లోని 13 మంది నిందితులకు అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి ముకేష్‌కుమార్ శిక్షలు విధించినట్లు అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ సత్యనారాయణలు గురువారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి ఏడురోజులు, మరో నిందితుడికి పదిరోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే గ్యాంబ్లింగ్ కేసులో 13 మంది నిందితులకు ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎర్రగుంట్ల, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లదుర్తి పెన్నా బ్రిడ్జిపై బైక్, ఆటో ఢీ కొన్న సంఘటనలో హనుమనగుత్తికి చెందిన అరుణ్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు నుంచి బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో అరుణ్ కాళ్లకు తీవ్ర గాయాలు కాగా కడప ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 | జమ్మలమడుగు - S.R.: 94404 72816 | మైదుకూరు - S.R.: 91334 42886 | బద్వేల్ - S.R.: 99666 83437 | D.C.M. : 99854 11184